క్లుప్తంగా

ఉన్నత చదువులకు ఆర్థిక సాయం



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పిట్లం శాఖ దత్తత తీసుకున్న పిట్లంకు చెందిన విద్యార్థిని వైష్ణవి ఉన్నత చదువుల నిమిత్తం రూ.1,20,000 చెక్కును ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ.. వైష్ణవికి హాస్టల్ ఫీజ్ కోసం ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. వైష్ణవిని పిట్లం లయన్స్ క్లబ్ దత్తత తీసుకుని ఆర్మూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ చదివించామని అనంతరం బీటెక్ కన్వీనర్ కోటాలో సీట్ సాధించడంతో ఈ మూడు సంవత్సరాలు హాస్టల్ ఫీజును పిట్లం క్లబ్ సభ్యుల సహకారంతో చెల్లిస్తున్నామన్నారు. క్లబ్ రీజియన్ చైర్మన్ అనితా రెడ్డి , రీజియన్ కో-ఆర్డినేటర్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. మంగళవారం ఆయన బోనాల్‌లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఇల్లు నిర్మాణం వేగవంతంగా పూర్తి చేస్తే దశల వారీగా బిల్లులు జమ చేస్తామన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారిణి అరుణ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు విడతల వారీగా బిల్లులు మంజూరవుతాయని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారికి ఆన్‌లైన్ చేయించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఆమె వెంట స్థానిక ఎంపీడీవో అనిత, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌సింగ్ ఉన్నారు.

నిర్మాణంలో జాప్యం చేయొద్దు

ఎల్లారెడ్డిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం చేయొద్దని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. మంగళవారం మౌజాన్‌ఖేడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా ఇసుక ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇంటి నిర్మాణ పనులు ఆగకుండా చూడాలని లబ్ధిదారులకు సూచించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



బీబీపేట: మహిళలు ఆర్థికంగా ఎదగాలని అందుకోసం మహిళా సమాఖ్య సంఘం ఉపయోగపడుతుందని ఏపీఎం బాల పోచయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పలు అంశాలు చర్చించినట్లు వివరించారు. సమావేశానికి సమాఖ్య అధ్యక్షురాలు స్రవంతి, సీసీలు శ్రీనివాస్, బాలచంద్రం, రాజేశ్వరరెడ్డి, నవీన్, అకౌంటెంట్ రాజేందర్, బ్యాంకు మిత్ర శ్యామల, గ్రామ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

వైద్యాధికారి పేరు మార్చండి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ మండలానికి పశువైద్యాధికారిగా రాంప్రసాద్ బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నాయి. కానీ అక్కడ ఉన్న బోర్డులో మాత్రం పాత వైద్యాధికారి పేరు, ఫోన్ నంబర్ తొలగించలేదు. పశువైద్యశాలకు వచ్చే రైతులు అసలు డాక్టరెవరో తెలియని పరిస్థితి ఉంది. అక్కడ ఉన్న ఫోన్ నంబర్‌ను మార్చాల్సిన అవసరం ఉంది.

కు.ని ఆపరేషన్లు ప్రారంభం

మద్నూర్(జుక్కల్): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ(కు.ని) ఆపరేషన్లు ప్రారంభమైనట్లు మంగళవారం ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. వేసవిలో తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా వేసవి కాలం ప్రారంభంలోనే కు.ని ఆపరేషన్లను నిలిపివేశామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలై ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో తిరిగి కు.ని ఆపరేషన్లు చేస్తున్నామని వైద్యులు తెలిపారు. ఆపరేషన్లు చేసుకునేవారు సోమవారం పూర్తి రిపోర్ట్‌లతో ఆస్పత్రికొచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి గురువారం ఆపరేషన్లు చేస్తామన్నారు.

ఇంటిగ్రేటెడ్‌కు మోక్షమెప్పుడో..?

- నిలిచిన మార్కెట్ నిర్మాణం
- రోడ్లపైనే కూరగాయల విక్రయం
- మటన్, చికెన్ వ్యాపారులకు ఇబ్బందులు



బాన్సువాడలో మధ్యలో నిలిచిన మార్కెట్ నిర్మాణం

బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలోని పాత వీక్లీ మార్కెట్ ఆవరణలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమైనా పూర్తి స్థాయిలో నిధులు విడుదల కాలేదు. రెండున్నరేళ్లుగా నిర్మాణం ముందుకు సాగడం లేదు. సరిపడా నిధులు విడుదలై ఉంటే 2022 చివరి మాసంలోనే మార్కెట్ అందుబాటులోకి వచ్చేది. సరైన మార్కెట్ సదుపాయం లేక వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పాత బాన్సువాడకు వెళ్లే దారిలో...బాలికల ఉన్నత పాఠశాల ముందు ఇరుకైన రోడ్లకు ఇరువైపులా కూరగాయలు, పండ్లు, చికెన్ విక్రయాలు కొనసాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. దీంతో ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని పట్టణవాసులు, వ్యాపారుల ఇబ్బందులను గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది.

ప్రభుత్వం దృష్టి సారిస్తేనే....

అయితే స్థానిక పరిస్థితులు, పెరిగిన ధరల ప్రకారం మార్కెట్ నిర్మాణానికి వ్యయం పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. అదనంగా కావాల్సిన నిధులను ప్రగతి నిధుల నుంచి వినియోగించుకోవాలని గత ప్రభుత్వం ఆదేశించింది. పట్టణ ప్రగతి పనులకే నిధులు రావడం లేదు. కొత్తగా మార్కెట్ నిర్మాణానికి ఎక్కడి నుంచి నిధులు సమీకరించుకోవాలో మున్సిపల్ యంత్రాంగానికి అంతుచిక్కని సమస్యగా మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి సమీక్షిత మార్కెట్ నిర్మాణానికి సరిపడా నిధులు కేటాయించి పూర్తి చేయాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.

రూ.2 కోట్ల నిధులతో నిర్మాణ పనులు..

ఒకే చోట అన్ని రకాల వ్యాపారాలు జరుపుకునేలా మార్కెట్ నిర్మాణం చేపట్టేందుకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. పాత వీక్లీ మార్కెట్ ఆవరణలో రెండెకరాల స్థలంలో 2022 ఫిబ్రవరి 5న అప్పటి స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పనులను ప్రారంభించారు. కూరగాయల బ్లాక్‌లో 60 గదులు, మాంసాహార బ్లాక్‌లో 30 గదులు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు స్లాబ్‌లు మాత్రమే పూర్తి చేశారు. కాంట్రాక్టర్‌కు సుమారుగా రూ.60 లక్షలు మాత్రమే చెల్లించారు. మరో రూ. 1.40 కోట్లు రావాల్సి ఉండడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి



వంట గదిని పరిశీలిస్తున్న అధికారి శివ కుమార్

తాడ్వాయి (ఎల్లారెడ్డి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి శివకుమార్ అన్నారు. ఆయన మంగళవారం తాడ్వాయి కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. తాజాగా ఉండే కూరగాయలతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. వంట గదిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో విద్యాబోధన చేయాలన్నారు. కృష్ణాజీవాడిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ప్రిన్సిపాల్ రాణి, కార్యదర్శి చంద్రకళ తదితరులున్నారు.

ఐడియా అదిరింది గురూ..!

- కోతులను భయపెట్టేందుకు బుల్లెట్ లేని గన్



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో కోతులను తరమడానికి బుల్లెట్ లేని గన్‌ను విక్రయించారు. దాంతో గ్రామస్తులు ఆసక్తిగా కొనుగోలు చేశారు. ప్లాస్టిక్ పైపుకు లైటర్ అమర్చారు. అందులో కార్బైట్ అనే మూలకం వేసి నీటి చుక్కలు వేయడంతో చర్య జరిగి గట్టి శబ్దం వస్తుంది. ఆ పైపు నుంచి నిజమైన గన్ పేలినట్లు శబ్దం వస్తుంది. దాంతో కోతులు భయాందోళనకు గురై పారిపోతున్నాయి. తక్కువ ఖర్చుతో కోతులను పరుగెత్తించవచ్చని ప్రజలు ఆసక్తిగా బుల్లెట్ లేని గన్‌ను కొనుగోలు చేశారు. మహారాష్ట్రకు చెందిన సంతోష్ దంపతులు మంగళవారం లింగంపేట బస్టాండు ప్రాంతానికి వచ్చి విక్రయించారు. గ్రామస్తులు ఆ తుపాకీని ఆసక్తిగా తిలకించారు.

ఆత్మగౌరవ గర్జన కార్యక్రమానికి తరలిరావాలి



లింగంపేటలో సమావేశమైన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు

ఎల్లారెడ్డిరూరల్: ఆత్మగౌరవ గర్జన కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ముజీబుద్దీన్‌తో కలిసి ఆత్మగౌరవ గర్జన సభ గురించి చర్చించారు. ఈ నెల 25న ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేటలో ఆత్మగౌరవ గర్జన కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారని అన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో కేటీఆర్ ఆత్మ గౌరవ గర్జన సభను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్ తెలిపారు. మంగళవారం స్థానిక జీఎస్ఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సభ ఉంటుందన్నారు. నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

బంజారాల అభివృద్ధికి సహకరించాలి



ఎమ్మెల్యేతో బంజారా సంఘం నాయకులు

ఎల్లారెడ్డి: బంజారాల సంఘం అభివృద్ధికి సహకరించాలని బంజారా సంఘం నాయకులు మంగళవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కోరారు. బంజారాల అభివృద్ధికి ఏ నాయకులూ సహకరించలేదని, తమ సంఘాలకు కమ్యూనిటీ భవనాలు, ఫంక్షన్ హాల్ నిర్మాణాలకు నిధులను కేటాయించాలని వారు, ఎమ్మెల్యేకు విన్నవించారు. బంజారా సంఘం అధ్యక్షులు రాములు నాయక్, కాంగ్రెస్ నాయకులు సాయిబాబా తదితరులున్నారు.

మాకు న్యాయం చేయండి



రాజంపేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం గ్రామానికి చెందిన కొంతమంది ఆశావహులు తహసీల్దార్ జానకికి వినతి పత్రం అందజేశారు. రైతు వేదిక భవనంలో శనివారం ప్రకటించిన లబ్ధిదారుల జాబితాలో కొంతమంది అనర్హులు ఉన్నారని ఈ విషయంపై అధికారులు విచారణ జరిపి తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని కోరారు.

యూరియా కొరత ఉండొద్దు



నస్రుల్లాబాద్: రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని బాన్సువాడ ఏడీఏ అరుణ అన్నారు. మంగళవారం నస్రుల్లాబాద్, మైలారం సొసైటీ పరిధిలో గల ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఎరువులు బ్లాక్‌లో అమ్మి కొరత సృష్టిస్తే లైసెన్సులను రద్దు చేయడంతో పాటు శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో భవాని, సిబ్బంది సంగమేశ్వర్, పోచయ్య తదితరులున్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి



రామారెడ్డి: రైతులు తమ బోరుబావులకు కెపాసిటర్లు బిగించుకోవాలని విద్యుత్ శాఖ డీఈ కల్యాణ్ చక్రవర్తి సూచించారు. గోకుల్‌తండాలో మంగళవారం విద్యుత్ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ .. కెపాసిటర్ వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. దీని వల్ల విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉంటాయన్నారు. విద్యుత్ స్టార్టర్ బాక్స్‌లు కూడా కచ్చితంగా ప్లాస్టిక్‌వి వాడాలని సూచించారు. దీనివల్ల రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ఉంటారని పేర్కొన్నారు. విద్యుత్ అధికారి లక్ష్మీనరసింహ, లైన్‌మన్ కైలాష్, రైతులు పాల్గొన్నారు.

లాటరీ పద్ధతిలో ఇళ్ల పంపిణీ

భిక్కనూరు: మండల కేంద్రంలో మంగళవారం డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇళ్లను అధికారులు పంపిణీ చేశారు. 50 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ సునీత తెలిపారు. లాటరీ పద్ధతిలో నెంబర్ వైస్‌గా ఇళ్లను కేటాయించినట్లు వారు తెలిపారు. ఎంపీడీవో రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, విద్యుత్ ఏఈ సంకీర్త, ఆర్ఐ బాలయ్య, తదితరులున్నారు.

కవులు, రచయితలకు దాశరథి ఆదర్శం



దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెరవే ప్రతినిధులు



కామారెడ్డి ఆర్ట్స్ కళాశాలలో..

కామారెడ్డి అర్బన్: కవులు, రచయితలకు దాశరథి కృష్ణమాచార్య జీవితం ఆదర్శమని తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ అన్నారు. తెరవే ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాశరథి కవితలు, రచనలు చదివి వినిపించారు. తెరవే జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి మోహన్‌రాజ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

దాశరథి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

కామారెడ్డి అర్బన్: నిజాం నిరంకుశపాలనలో తిరుగులేని పోరాటం చేసి నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న దాశరథి కృష్ణమాచార్య ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయకుమార్ అన్నారు. దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, సమన్వయకర్త జయప్రకాష్, అధ్యాపకులు రాజేందర్, కవిత, రవికుమార్, మల్లేష్, అంజనేయులు, రమేష్, సత్యం, బాలాజీ, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్ డిమాండు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఎల్లారెడ్డి, కామారెడ్డి, తాడ్వాయి మండలాలకు వెళ్లి రోజుల తరబడి స్థానికులు నిరీక్షించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు చేపడతామన్నారు. నాయకులు రాంచందర్, దత్తురాం, రవి, శుభాష్, అల్లూరి, గణేష్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల కొరత తీర్చాలని ఆందోళన



భిక్కనూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అధ్యాపకుల కొరత ఉందని, విద్యార్థులకు పాఠాలు బోధించేవారు లేరని తెలియజేస్తూ టీజీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం భిక్కనూరులో ఆందోళన నిర్వహించారు. స్థానిక సినిమా టాకీస్ చౌరస్తాలో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ అధ్యాపకులు లేరని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి అధ్యాపకులను కేటాయించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గందం సంజయ్, నాయకులు సమీర్, భరత్, కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీపై దుష్ప్రచారం చేస్తే చట్టరీత్యా చర్యలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాజంపేట : ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో పారదర్శకంగానే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని రాజంపేట కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బెస్తం చంద్రం అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతి పక్షాలు, కొందరు వ్యక్తులు తమ పార్టీపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక చేస్తే ఈ విషయాన్ని పార్టీకి ఆపాదించడం ఏంటని ప్రశ్నించారు. ఎవరైనా అనర్హులు ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు కటికే బాలాజీ, జూకంటి సుధాకర్ రెడ్డి, హైమద్ అలీ, మేకల నర్సింలు, ఆమిదాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాల సంఘం నేతలు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణంలోని మీనాగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మాల సంఘం అధ్యక్షుడు అయ్యాల సంతోష్ కోరారు. మంగళవారం ఆయన దేశాయిపేట్‌లో మాల సంఘం నాయకులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మాలల రిజర్వేషన్లు, హక్కుల సాధన కోసం జరిగే పోరాటానికి మాలలు వేలాదిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ప్రశాంత్‌కుమార్, బిచ్కుంద రాములు, జంగం సాయిలు, అయ్యాల పోచారం, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ బోనాల పండుగ



ఆస్పత్రిలో బోనాలతో వెళ్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో చైర్మన్ కాసుల

బాన్సువాడ : బాన్సువాడ మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఎల్లమ్మ బోనాల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాల పండుగను నిర్వహిస్తారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులు సుఖ ప్రసవం చేసుకుని తల్లీబిడ్డతో సంతోషంగా ఇంటికి వెళ్లాలని ఎల్లమ్మను వేడుకున్నారు. ఎల్లమ్మకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది ఉన్నారు.

రాజంపేట: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆషాఢం బోనాల్లో భాగంగా పాఠశాలలో ఉత్సవాలు నిర్వహించినట్లు హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో మంగళవారం ఒడ్డెర సంగం ఆధ్వర్యంలో, బొమ్మన్‌దేవ్‌పల్లిలో బోనాలను ఘనంగా నిర్వహించారు. పెద్ద పోచమ్మ, నల్ల పోచమ్మకు మొక్కులు చెల్లించారు.

ఎల్లారెడ్డిరూరల్: వెల్లుట్లలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల శోభాయాత్ర నిర్వహించి పెద్దమ్మ తల్లికి సమర్పించారు. పిల్లాపాపలు, పాడి పంటలతో సల్లంగా ఉండాలని అమ్మ వారిని వేడుకున్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు.

సంక్షిప్తం

స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ మండలాధ్యక్షుడు కుంట రాంరెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు భూంరావు, చక్రధర్ గౌడ్, రమేశ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పంట సాగులో మెలకువలు పాటించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు పంటలు పండించేటప్పుడు మెలకువలు పాటించాలని అగ్రికల్చరల్ ట్రైనింగ్ విద్యార్థులు అన్నారు. తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమం ఆవరణలో మంగళవారం మహాజ్యోతిభాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల మహిళా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృషి అనుభవం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటలను వేసుకునే ముందు విత్తనాల రకాలు, మోతాదు, శుద్ధి తదితర అంశాలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని, అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని అధ్యాపకులు అన్నారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు మంగళవారం తాడ్వాయి, లింగంపేట్ మండలంలోని పలు గ్రామాలలో తిరుగుతూ ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు చేశారు. ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, ఉపకార వేతనాలు అందిస్తుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యాన్సర్ బాధితురాలికి రక్తదానం

కామారెడ్డి అర్బన్: బ్లడ్ క్యానర్స్‌తో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కామారెడ్డికి చెందిన ఓ మహిళకు పట్టణానికి చెందిన ఎం. వంశీకృష్ణ మంగళవారం 10వ సారి ఓ పాజిటివ్ రక్తదానం చేశారు. కోరిన వెంటనే దాత వంశీకృష్ణ హైదరాబాద్‌కు వెళ్లి రక్తదానం చేయడం పట్ల రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు, రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ తదితరులు అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించండి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభించాలని కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. కాలనీలో సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, మురికి కాలువలను సైతం నిర్మించాలని వారు కోరారు. కాలనీవాసులు మహేష్, ప్రవీణ్ ఉన్నారు.

పాఠశాల తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్): మాగి గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం స్థానిక ఎంఈవో తిరుపతి రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆయన సూచించారు. హెచ్ఎం షమీనా, ఉపాధ్యాయులు శైలజ, విఘ్నేశ్వరి ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899